PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :99 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : గురువారం - 24 సెప్టెంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:99 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: THURSDAY 24 SEPTEMBER 2026 PAGES: 04 RS:01/

ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి మిగతా2లో...

2027 నాటికి హంద్రీనీవా పనులు పూర్తి చేయాలి

● హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2 పనులను వేగవంతం చేయాలి.. ● అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి,సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. 2027 నాటికి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సీఎం అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులపై సమీక్షించారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని పనుల పురోగతిపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2లో మిగిలిన పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సూచించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, పనులను 2027 నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాయచోటి నియోజకవర్గ పరిధిలో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు సంబంధించి 490 నుంచి 535 మిగతా2లో...

టెక్కలి సమీపంలో ఘోర రైలు ప్రమాదం

రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల మృతి.. మరో విద్యార్థికి గాయాలు



శ్రీకాకుళం, 23(నేటి మినిట్ టు మినిట్): శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో మంగళ వారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొన డంతో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా టెక్కలిలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమా దంలో విశాఖరావు, దిలీప్‌కుమార్, శరత్‌కు మార్, శివ మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారిం చారు. ట్రాక్ దాటే సమయంలో రైలు రాకను గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రైల్వే భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.నలుగురు విద్యార్థులు మిగతా2లో...



తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్

ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు

న్యూఢిల్లీ, 23(నేటి మినిట్ టు మినిట్): బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు మిగతా2లో...

భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

రూ.22,177 కోట్ల పెట్టుబడులు.. 19,739 ఉద్యోగాలకు అవకాశం



అమరావతి, సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో మొత్తం రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు, 19,739 ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.పరిశ్రమలు, ఇంధనం, ఆహార శుద్ధి, ఐటీఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మై హోమ్ ఇండస్ట్రీస్, క్యాటర్‌పిల్లర్, ఫీనిఖీ క్లోతింగ్, దాల్మియా సిమెంట్, అగర్వాల్ ఫౌండ్రీస్, LG ఎలక్ట్రానిక్స్ తదితర సంస్థలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.అమరావతి రాజధాని పరిధిలో మిగతా2లో...

అమరావతిలో ప్రపంచస్థాయి నేత్ర వైద్య కేంద్రం

- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు భూమిపూజ చేసిన సీఎం చంద్రబాబు



అమరావతి సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమరావతి రాజధానిలో మరో ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు శ్రీకారం చుట్టారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నూతన ప్రాంగణం నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మిగతా2లో...

అగ్రిగోల్డ్ బాధితులకు తొలి విడతలోనే న్యాయం

- పూర్తి డబ్బు చెల్లించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యం బాండ్ల సేకరణకు 20 ప్రత్యేక బృందాలు

అమరావతి 23(నేటి మినిట్ టు మినిట్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, అగ్రిగోల్డ్‌పై ప్రభుత్వం నియమించిన మంత్రుల సబ్‌కమిటీ సభ్యుడు నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం సచివాలయంలో అగ్రిగోల్డ్‌పై స్టేట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి బాండ్లు కలిగి ఉన్న బాధితులు తమ ఒరిజినల్ బాండ్లను చూపించి, జిరాక్స్ కాపీలను మిగతా2లో...

మా షరతులకు అంగీకరిస్తేనే హార్మ్‌జ్‌ను తెరుస్తాం

స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ



విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు అవగాహన కార్యక్రమాలు

- మంత్రి నారా లోకేశ్

అమరావతి 23(నేటి మినిట్ టు మినిట్): విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మిగతా2లో...

2027 నాటికి హంద్రీనీవా పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కిలోమీటర్ల వరకు సుమారు రూ.350 కోట్ల విలువైన పనులను సమగ్రంగా చేపట్టాలని సీఎం సూచించారు. **25 వేల ఎకరాల చెరువులకు నీరు** హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పూర్తయితే తాగునీరు, సాగునీటి అవసరాలు తీరడంతో పాటు సుమారు 25 వేల ఎకరాల పరిధిలోని ఖాళీ చెరువులను నింపే అవకాశం ఉంటుందని మంత్రి మండిపల్లి తెలిపారు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌తో అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని ఆయన సూచించారు. హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. **స్థానిక ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం** రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నందున రైతులను పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అక్టోబర్ 2న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జి మంత్రులు అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, మూడు పార్టీల మధ్య సమన్వయం, ఐక్యత ఉండాలని సూచించారు. తొలిదశలో మున్సిపాలిటీలు, రెండో దశలో జెడ్పీటీసీ, మూడో దశలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విధంగా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఇదే సందర్భంగా రాజకీయ ఉద్రిక్తతలు, శాంతిభద్రతల అంశాలపై సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం, శాప్ కార్యాలయంపై జరిగిన దాడుల వెనుక ఒకే వర్గం ఉందని ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్ బెంగళూరులో ఉండి రౌడీషీటర్లు, నేరస్థులను పంపి నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు విమర్శించా రు. రాజకీయ పార్టీల ముసుగులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను సహించబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి నుంచి పరిహారం వసూలు చేసే విధంగా చట్టాన్ని రూపొందించాలని డీజీపీని సీఎం ఆదేశించారు.

టెక్కలి సమీపంలో ఘోర రైలు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఒకేసారి మృతి చెందడంతో టెక్కలి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. **మరో విద్యార్థికి గాయాలు** ఈ ఘటనలో సాల్మన్‌రాజ్ అనే మరో విద్యార్థి గాయపడినట్లు అధికారులు తెలిపారు. అతడిని టెక్కలి డీహెచ్‌లో చికిత్సకు తరలించారు. **బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు** టెక్కలి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖరావు, దిలీప్‌కుమార్, శివ, శరత్‌కుమార్ మృతి అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం.. రైలు రాకను గమనించకపోవడంతో ప్రమాదం జరిగిన ట్లు అధికారులు వివరించారు. గాయపడిన సాల్మన్ రాజ్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశిం చారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకో వాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అం డగానిల వాలని చంద్రబాబు అధికారులకు సూచించారు.

అమరావతిలో ప్రపంచస్థాయి నేత్ర వైద్య కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి అభివృద్ధి, వైద్యరంగం, పరిశోధన, సాంకేతిక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. 12 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఈ సంస్థ ద్వారా ఏటా సుమారు 3 లక్షల మందికి నేత్ర వైద్య సేవలు అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు సీఎం తెలిపారు. కంటి చికిత్సలకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధన, శిక్షణ, విద్యా కార్యక్రమాలకు కూడా ఈ కేంద్రాన్ని వేదికగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అమరావతిలో ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ప్రపంచస్థాయి నేత్ర వైద్య పరిశోధనా కేంద్రంగా ఎదగాలని కోరారు. **3 కోట్ల కంటి చికిత్సలు** ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఇప్పటివరకు దాదాపు 3 కోట్ల కంటి చికిత్సలు అందించిందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లోని 319 కేంద్రాల ద్వారా పేదలకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న సంస్థ అమరావతి కేంద్రం ద్వారా సేవలను మరింత విస్తరించనుందని తెలిపారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు సకాలంలో చికిత్స అందించే విధంగా సంస్థ పనిచేస్తోందని చెప్పారు. **హెల్త్‌కేర్ హబ్‌గా అమరావతి** అమరావతిని నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌తో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు అమరావతి హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.



విద్యా రంగంలోనూ పలు ప్రముఖ సంస్థలు అమరావతికి వస్తున్నాయని తెలిపారు. **ఐదు అంశాలతో రాజధాని నిర్మాణం** అమరావతిని నో-పొల్యూషన్ సిటీ, బ్లూ అండ్ గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీ, కార్బన్ న్యూట్రల్ సిటీ, డీప్‌టెక్ క్యాపిటల్గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం చెప్పారు. కాలుష్యరహిత వాతావరణంతో పాటు హరిత ప్రాంతాలు, గ్రీన్ ఎనర్జీ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. **క్వాంటం కంప్యూటింగ్‌కు కేంద్రంగా అమరావతి** సాంకేతిక రంగంలోనూ అమరావతిని ముందంజలో నిలపడానికి చర్యలు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రస్తావించారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. అలాగే స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాల్లో క్లస్టర్లను అభివృద్ధి చేసి భవిష్యత్ సాంకేతిక పరిశ్రమలకు అమరావతిని కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. **రూ.50 వేల కోట్ల పనులు** అమరావతిలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని సీఎం తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రస్తావించారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను సీఎం మరోసారి గుర్తుచేసుకున్నారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అమరావతి భవిష్యత్తులో ఆరోగ్యం, పరిశోధన, విద్య, నాలెడ్జ్ ఎకానమీతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు తొలి విడతలోనే న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక బృందాలకు అందించాలని మంత్రి సూచించారు. బాండ్ల సేకరణ కోసం మొత్తం 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 3, ఇతర రాష్ట్రాల్లో 10 బృందాలు రెండు, మూడు రోజుల్లో క్షేత్రస్థాయిలో పనిచేయనున్నాయని వెల్లడించారు. అగ్రిగోల్డ్ గతంలో సేకరించిన భూముల్లో చేపట్టిన ప్లాంటేషన్‌పై అటవీశాఖ ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి ఆడిట్ నిర్వహించనుందని చెప్పారు. అక్కడి వృక్ష సంపద విలువను కూడా అంచనా వేయనున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ పరిధిలో అగ్రిగోల్డ్ వేసిన లేఅవుట్ల పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారని వివరించారు. **35,544 మంది బోనాఫైడ్ లబ్ధిదారులు** అగ్రిగోల్డ్ ప్లాట్లు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న బోనాఫైడ్ లబ్ధిదారులకు తొలి దశలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ భూములు 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్నందున, వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చేసేందుకు త్వరలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 42,531 మంది ప్లాట్ లబ్ధిదారుల్లో 35,544 మందిని బోనాఫైడ్ లబ్ధిదారులుగా గుర్తించినట్లు వెల్లడించారు. మరో 6,989 మంది పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగలేదని, వారికి రెండో విడతలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రిగోల్డ్ అంశంపై ఇకపై సబ్‌కమిటీ సమావేశాలను వేగవంతం చేసి, సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను త్వరగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని నాదెండ్ల మనోహర్ తెలిపారు. అగ్రిగోల్డ్ కారణంగా నష్టపోయిన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు సీసీఎల్ఏ, పోలీస్, మున్సిపల్ పాల్గొన్నారు.

ఏపీలో డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశాలివ్వాలని గవర్నర్‌కు వైసీపీ ఫిర్యాదు



అమరావతి :సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): ఏపీలో జరిగిన డీఎస్సీ-2025 ఉద్యోగ నియమకాల్లో జరిగిన అక్రమాలపై ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐచే విచారణ జరిపించాలని కోరారు. అదేశిదంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద వైసీపీ నాయకులపై దాడి గురించి కూడా ఫిర్యాదు చేశారు. అంతకు ముందు గ్రేటర్ విశాఖపట్నం నాయకులతో తాడేపల్లిలోని పార్టీకార్యాలయంలో సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలకు చేస్తున్న మోసాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేయాలని సూచించారు. విశాఖ తాగునీటి సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదేవిధంగా విశాఖలో తన కుటుంబ సభ్యులకు అప్పనంగా అప్పగిస్తున్న ప్రభుత్వ భూములపై అలుపెరగని పోరాటం చేయాలని హితబోధ చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న అవినీతి ఏ స్థాయికి వెళ్లిందో చెప్పడానికి డీఎస్సీ వ్యవహారమే ఒక నిదర్శనమని పేర్కొన్నారు. అన్యాయానికి పాల్పడుతున్న పోలీసుల వివరాలను డిజిటల్ డైరీలో నమోదు చేయాలని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ డైరీని ఓపెన్ చేస్తామని అన్నారు. టోపీపై ఉండే సింహాలకు మాత్రమే తలవంచాలని, చంద్రబాబుకు కాదని పోలీసులకు సూచించారు.

ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. **ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు. **పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు" అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు. **కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. "జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు" అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో-ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు. **ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు. **సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,548.98 కోట్లు, శాసనసభ భవన నిర్మాణానికి రూ.661 కోట్లు మంజూరు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.125.65 కోట్ల సవరించిన పరిపాలనా అనుమతికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2.73%, 1.82% చొప్పున రెండు విడతల డీఏ/డీఆర్ మంజూరుకు ఆమోదం తెలిపింది. దీని వల్ల ప్రభుత్వంపై సుమారు రూ.4,556 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఉద్యోగులకు సెప్టెంబర్ 2026 జీతం నుంచి నగదు ప్రయోజనం అందనుంది. అమరావతిలోని ల్యాండ్ పూలింగ్ రైతులకు వార్షిక భృతి, వివిధ జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సోలార్‌విండ్ ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, విద్యాపర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

న్యూయార్క్: సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం' అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు.'వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది' అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు అవగాహన కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఈ ఏడాది 'మిషన్ మార్చ్' విధానంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 963 పాఠశాలల్లో విద్యార్థులకు యోగా శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు భయం, ఆందోళనను అధిగమించేందుకు సహాయపడుతుందని మంత్రి తెలిపారు. యోగా ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

తుఫానుపై ఆర్టీజీఎస్ అప్రమత్తం



అమరావతి: సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): ఉత్తరాంధ్రపై తుఫాను ప్రభావం నేపథ్యంలో ఆర్టీజీఎస్ పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి తుఫాను కదలికలు, వాతావరణ పరిస్థితులను రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తూ ప్రభావిత జిల్లాల అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అవేర్ యాప్, వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు తుఫాను కదలికలు, వర్షాలపై హెచ్చరికలు అందిస్తున్నారు. అవేర్ వెబ్‌సైట్-ల ద్వారా ప్రజలు తమ ప్రాంత వాతావరణ పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

‘ పాపం 16 ఏళ్ల పాప..? జవాన్ జాడలేదు ‘

మైనర్ బాలిక కేసు.. పోలీసుల ‘యాక్షన్’ ఎక్కడ?

ప్రేమించాడు.. మోసం చేశాడంటున్నారు.. జవాన్ మాత్రం జాడలేడు!

ఫిర్యాదు పరుగులు.. దర్యాప్తు అడుగులు!

అస్సాంకు జవాన్ జంప్.. కూడేరు పోలీసుల చూపు ఎటు?

జవాన్ ప్రేమ.. బాలిక కన్నీళ్లు.. పోలీసుల మౌనం!

రెండేళ్ల కథకు క్లైమాక్స్.. జవాన్ పరార్!

తల్లి గగ్గోలు.. చర్యలపై మాత్రం ‘వెయిటింగ్’!

మైనర్ కేసులో చట్టం ఏం చెబుతోంది?.. పోలీసుల సమాధానం ఎప్పుడు?

కేసు ఉంది.. ఆరోపణలు ఉన్నాయి.. మరి చర్యలెక్కడ?

జవాన్ దూరం.. బాలిక వేదన.. పోలీసుల దర్యాప్తు మాత్రం ప్రశ్నార్థకం!

బాధితురాలి తల్లి మీడియా ముందుకు.. అయినా కదలని కేసు!

పోక్సో వర్తింపుపై ప్రశ్నలు.. ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్

దేశాన్ని కాపాడే జవాన్.. బాలికకు న్యాయం ఎవరు?

బాలిక ఆత్మహత్యాయత్నం చేసిందంటున్న తల్లి.. రక్షణ కోసం వేడుకోలు

కూడేరు పోలీసుల తీరుపై ప్రశ్నలు.. ఉన్నతాధికారుల స్పందన కోసం ఎదురుచూపు

16 ఏళ్ల బాలిక కేసులో పోలీసుల తీరుపై ఆరోపణలు!

ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ బాలిక తల్లి ఆవేదన

జవాన్ అస్సాంకు వెళ్లిపోయాడని ఫిర్యాదు.. చర్యలు ఆలస్యమవుతున్నాయంటూ ఆరోపణలు

పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలంటున్న కుటుంబ సభ్యులు




కూడేరు సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): 16 ఏళ్ల బాలికను కొంతకాలంగా ప్రేమ పేరుతో వెంట తిరిగి, అనంతరం వదిలేసి వెళ్లిపోయాడని ఆరోపిస్తూ ఓ బాలిక తల్లి చేస్తున్న ఫిర్యాదులు కూడేరు పోలీసుల తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సంబంధిత వ్యక్తి జవాన్‌గా పనిచేస్తున్నాడని, ప్రస్తుతం అస్సాంకు వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన కుమార్తెను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని, కొంతకాలం పాటు ఆమెతో సంబంధం కొనసాగించాడని బాలిక తల్లి ఆరోపిస్తోంది. మరో యువతితో నిశ్చితార్థం చేసుకుని తమ కుమార్తెను వదిలి వెళ్లిపోయాడని ఆమె వాపోయింది. **బాలిక ఆత్మహత్యాయత్నం చేసిందంటూ తల్లి ఆవేదన** జవాన్ మోసం చేశాడనే మనస్తాపంతో తన 16 ఏళ్ల కుమార్తె ఆత్మహత్యకు ప్రయత్నించిందని తల్లి చెబుతోంది. ప్రస్తుతం బాలిక తీవ్ర మానసిక వేదనలో ఉందని, పాఠశాలకు వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. **కుటుంబ సభ్యుల వేధింపులపైనా ఆరోపణలు** జవాన్ కుటుంబ సభ్యులు తమ కుమార్తెను అవమానిస్తూ, బెదిరిస్తూ మాట్లాడుతున్నారని బాలిక తల్లి ఆరోపిస్తోంది. బాలికకు రక్షణ కల్పించాలని, ఆమెను వేధిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతోంది. **పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా చర్యలు లేవా?** సంబంధిత జవాన్ వెళ్లిపోతున్న విషయాన్ని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ అతడిని అదుపులోకి తీసుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోలేదని బాలిక తల్లి ఆరోపిస్తోంది. ఫిర్యాదులు చేసినప్పటికీ కేసు నమోదు, దర్యాప్తు విషయంలో ఆలస్యం జరుగుతోందని ఆమె వాపోతోంది. **పోక్సో చట్టం వర్తింపుపై ప్రశ్నలు** బాలిక వయస్సు 16 సంవత్సరాలని, తన కుమార్తెపై లైంగిక దాడి జరిగిందని తల్లి ఆరోపిస్తున్న నేపథ్యంలో పోక్సో చట్టంలోని నిబంధనల ప్రకారం దర్యాప్తు జరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేసులో ఏ సెక్షన్లు నమోదు చేశారో, అవి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయో అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. **కూడేరు సీఐపై కూడా ఆరోపణలు** ఈ వ్యవహారంలో కూడేరు పోలీస్ స్టేషన్ సీఐ రాజుపై కూడా బాలిక కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. తమ ఫిర్యాదులపై తగిన స్థాయిలో స్పందించలేదని వారు పేర్కొంటున్నారు. అయితే పోలీసుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. **ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్** బాలిక భద్రత, న్యాయం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బాలిక వాంగ్మూలం, అందుబాటులో ఉన్న ఆధారాలు, ఫోన్ సంభాషణలు, పత్రాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. **అసలు దర్యాప్తులో ఏమి తేలనుంది?** మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు ప్రతి అంశాన్ని చట్టపరంగా, సున్నితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవమెంత? ఇప్పటికే నమోదైన కేసులో ఏ సెక్షన్లు ఉన్నాయి? జవాన్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు? బాలికకు రక్షణ కల్పించారా? అనే ప్రశ్నలకు పోలీసుల అధికారిక సమాధానం కోసం స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బాధితురాలి గోప్యతను కాపాడుతూ, చట్ట ప్రకారం సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను వెల్లడించాలని బాలిక కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

“ కలం అమ్మకానికి కాదు.. నిజం చెప్పడానికే: సూర్యచంద్ర “

● “అన్యాయాలకు పాల్పడే వారితో కలిసి పనిచేయలేను” ● APWJF పదవికి సూర్యచంద్ర రాజీనామా ● “అన్యాయాలకు పాల్పడే వారితో కలిసి పనిచేయలేను” సూర్యచంద్ర ● జర్నలిస్టు సంఘమా..? డబ్బుల పంపిణీ కేంద్రామా..? ● అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన కలం.. డబ్బుల వ్యవహారంలో ఎందుకు మౌనం..? ● చిన్నారి ఘటన.. పెద్దల డబ్బుల పంచాయితీ..! ● వార్త రాయకూడదట.. మరి ఏం రాయాలి? డబ్బుల లెక్కలా..? ● “నాకు వచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేశా” సూర్యచంద్ర ● అయితే ఆ డబ్బుల కథ వెనుక ఉన్నది ఎవరు..? ● జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘమా.. “సెటిల్‌మెంట్ల” కోసమా..? ● న్యాయం కోసం నిలబడాల్సిన సంఘంలోనే ‘డబ్బుల రాజకీయం’నా..? ● నైతిక విలువలకు రాజీనామా లేదు.. కానీ పదవికి మాత్రం రాజీనామా! ● “ఇలాంటి వ్యవహారాల్లో భాగస్వామి కాలేను” అంటూ APWJF పదవికి సూర్యచంద్ర గుడ్‌బై ● జర్నలిస్టు సంఘాలు అనైతిక కార్యకలాపాలకు వేదికలు కాకూడదు ● చిన్నారి ఘటనలో డబ్బుల వ్యవహారంపై సంచలన ఆరోపణలు ● తనకు ఇచ్చిన డబ్బును తిరిగి పంపించానన్న సీనియర్ జర్నలిస్టు ● “అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన జర్నలిస్టులే ఇలా చేయడం బాధాకరం”



అనంతపురం, సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన జర్నలిస్టు సంఘాలు అనైతిక కార్యకలాపాలకు వేదికలుగా మారకూడదని సీనియర్ జర్నలిస్టు, 6 టీవీ అనంతపురం జిల్లా ఇంచార్జ్ సూర్యచంద్ర స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రాజ్యోతి ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. **చిన్నారి ఘటనలో డబ్బుల వ్యవహారమంటూ ఆరోపణలు** ఒక చిన్నారికి సంబంధించిన ఘటనలో కొందరు జర్నలిస్టు సంఘ నాయకులు డబ్బుల వ్యవహారానికి పాల్పడ్డారని సూర్యచంద్ర ఆరోపించారు. ఈ వ్యవహారంలో తనకు కూడా కొంత మొత్తం ఇచ్చారని, అనంతరం అసలు విషయం తెలుసుకున్న తాను ఆ డబ్బును తిరిగి పంపించానని ఆయన తెలిపారు. అదే సమయంలో ఘటనకు సంబంధించిన వార్తలను ప్రసారం చేయవద్దని తనను కోరినట్లు సూర్యచంద్ర పేర్కొన్నారు. **“జర్నలిస్టు సంఘాల లక్ష్యం సంక్షేమమే కావాలి”** జర్నలిస్టు సంఘాలు జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేయాల్సిందే తప్ప, ఎవరికైనా జరిగిన అన్యాయాన్ని ఆసరాగా చేసుకుని డబ్బుల వ్యవహారాలకు వేదికలు కాకూడదని ఆయన అన్నారు. “అన్యాయం జరిగితే ప్రశ్నించాల్సిన జర్నలిస్టులే ఇలాంటి వ్యవహారాలకు పాల్పడటం బాధాకరం. నైతిక విలువలతో జర్నలిజంలో కొనసాగుతున్న నేను ఇలాంటి వ్యవహారాల్లో భాగస్వామి కాలేను” అని సూర్యచంద్ర స్పష్టం చేశారు. **రాజీనామాతో జర్నలిస్టు వర్గాల్లో చర్చ** సూర్యచంద్ర రాజీనామా ప్రకటన అనంతరం జర్నలిస్టు సంఘాల పనితీరు, వాటి బాధ్యతలు, నైతిక విలువలపై చర్చ మొదలైంది. ఆయన చేసిన ఆరోపణలపై సంబంధిత జర్నలిస్టు సంఘ నాయకులు, ఇతర వ్యక్తుల వివరణ వెలువడాల్సి ఉంది.



Andhra Pradesh Broadcast Journalists Association
ANANTAPUR DISTRICT

From
Dr R.K. Surya, M.A.,Ph.D.,
General Secretary,
Anantapur District.

Date: 22.09.2026

To
The District President,
APWJF,
Anantapur District.

Subject: Resignation from the post of District General Secretary (APBJA)

Respected Sir.,

I hereby tender my resignation from the post of District General Secretary of APBJA, with effect from today. Due to personal reasons and other commitments, I am unable to devote the required time and attention to the responsibilities associated with this position. Therefore, I have decided to step down from the post.

I sincerely thank the District President (APWJF), District General Secretary (APWJF) bearers, executive members and all my journalist colleagues for their cooperation, support and trust extended to me during my tenure.

I will always remain committed to the welfare and unity of the journalist fraternity and extend my cooperation to the Union whenever required.

Kindly accept my resignation and relieve me from the responsibilities of the post.

Thanking you.

Dr. R.K. Surya

Copy to: The District General Secretary, Anantapur District.

Door No: 13B, R.K.Residency, Sri Balaji Nagar, KLD Road, Anantapur – 4, Anantapur District.
Phone: +91 94907 32700, Email id: rksurya.api@gmail.com

APWJF ఆర్గనైజేషన్‌కు రాజీనామా చేసిన ‘ డాక్టర్ ఆర్కే సూర్య

పాత్రికేయుల కోసం సెప్టెంబర్ 26న ఉచిత మెగా వైద్య శిబిరం





ధర్మవరం, సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో సెప్టెంబర్ 26న పుట్టపర్తి సాయి ఆరామం హోటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో బెంగళూరులోని వైదేహి హాస్పిటల్, హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, తిరుపతి ఎస్వీఐఎంఎస్, అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రుల వైద్య బృందాలు సేవలు అందించనున్నాయి. శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ తదితర విభాగాల నిపుణుల సేవలతో పాటు ECG, 2D ఎకో, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా మహిళలకు పాప్‌స్మియర్, మామోగ్రఫీ, సోనో మామోగ్రఫీతో పాటు ఇతర పరీక్షలు అందుబాటులో ఉంటాయి. జిల్లాలోని పాత్రికేయులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వి నియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం సూచించింది.

‘ కులం కాటు... ప్రతిభకు చేటు ‘

● క్రికెట్ పేరుతో ‘కిరికిరి’.. అనంతలో సెలక్షన్ల గోల్మాల్...! ● నాలుగు పరుగుల ఆట.. నలభై మ్యాచ్‌ల ఛాన్స్..! ● టాలెంట్ బెంచ్‌పై.. ‘సెలక్షన్’ మాత్రం జోరుమీద! ● అండర్-12, 14, 16లో అసలు ఆట ఎక్కడ?.. సెలెక్టర్ల తీరుపై తల్లిదండ్రుల ప్రశ్నలు ● బ్యాట్ పట్టిన పిల్లలు వందలు.. ఛాన్స్‌లు మాత్రం కొందరికేనా? ● ప్రతిభకు ‘నో ఎంట్రీ’.. పరిచయాలకు ‘గ్రీన్ సిగ్నల్’ అంటున్న తల్లిదండ్రులు ● ఫిర్యాదులు ఫైళ్లలో.. సెలక్షన్ల ఆట మాత్రం కొనసాగుతోందా? ● స్కోర్‌బోర్డుపై పరుగులు తక్కువ.. అవకాశాలు మాత్రం ఎక్కువ! ● వరుస ఓటములు.. అయినా వరుస అవకాశాలు! ● నాలుగు పరుగులకే నలభై మ్యాచ్‌లా?.. తల్లిదండ్రుల నిలదీత ● ఆటతీరా? ఆప్తుల తీరా?.. సెలక్షన్లపై అనుమానాలు ● పిల్లల క్రికెట్‌లో పెద్దల ‘ఆట’! ● అండర్-12లోనే సెలక్షన్లకు ఇన్ని ట్విస్టులా? ● వయసు ధ్రువీకరణ నుంచి సెలక్షన్ల వరకు.. అన్నింటిపైనా అనుమానాలే ● మీడియా ముందుకొస్తే పిల్లల కెరీర్ ఖతమేనా? తల్లిదండ్రుల ఆరోపణలు ● సెలక్షన్ కమిటీనా.. ‘సెలెక్ట్ చేసిన’ కమిటీనా? ● ప్రతిభను కొలిచే కొలమానం ఏది?.. తల్లిదండ్రుల ప్రశ్న ● పిల్లల భవిష్యత్తు బౌండరీ బయట.. సెలెక్టర్ల నిర్ణయాలు బౌండరీలోనా? ● ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినా.. చర్యల స్కోరు ‘సున్నా’



అనంతపురం: సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ పరిధిలో జూనియర్ క్రికెట్ సెలక్షన్లపై వివాదం ముదురుతోంది. అండర్-12, అండర్-14, అండర్-16 విభాగాల్లో సెలక్షన్ల ప్రక్రియ పారదర్శకంగా లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా కాకుండా ఇతర ప్రభావాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. **వరుస అవకాశాలు.. అయినా ఫలితాలపై ప్రశ్నలు**కొంతమంది ఆటగాళ్లు తక్కువ స్కోర్లు సాధిస్తున్నప్పటికీ వరుసగా మ్యాచ్‌ల్లో అవకాశాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాలుగు పరుగులు చేసిన ఆటగాళ్లకే పదేపదే అవకాశాలు కల్పిస్తూ, ప్రతిభ కనబరిచే ఇతర పిల్లలకు అవకాశాలు దక్కడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **సెలెక్టర్ల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం**జూనియర్ విభాగాల్లో సెలెక్టర్ల నిర్ణయాలు ఏ ప్రాతిపదికన తీసుకుంటున్నారో స్పష్టం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కనీస అర్హతలు, ప్రతిభ, ఆటతీరు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపికలు జరుగుతున్నాయనే ఆరోపణలు చేస్తున్నారు. **ప్రశ్నిస్తే పిల్లల భవిష్యత్తుపై బెదిరింపులా?** సెలక్షన్లపై మీడియా ముందు మాట్లాడితే తమ పిల్లలకు భవిష్యత్తులో క్రికెట్ అవకాశాలు లేకుండా చేస్తామని హెచ్చరిస్తున్నారనే ఆరోపణలు కూడా కొందరు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చాలామంది బహిరంగంగా మాట్లాడేందుకు వెనుకడుగు వేస్తున్నారని వారు చెబుతున్నారు. **వయసు ధ్రువీకరణపైనా అనుమానాలు** జూనియర్ క్రికెట్‌లో వయసు ధ్రువీకరణపై కూడా తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ వంటి పత్రాల్లో వయసు మార్పులు చేస్తున్నారనే ఆరోపణలతో పాటు, బోన్ ఏజ్ పరీక్షల విషయంలోనూ పారదర్శకత అవసరమని వారు కోరుతున్నారు. **చిన్నారులతో పెద్ద వయసు ఆటగాళ్లు?** అండర్-12, అండర్-14, అండర్-16 విభాగాల్లో వయసు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. చిన్న వయసు పిల్లలతో పోలిస్తే ఎక్కువ వయసున్న ఆటగాళ్లు పోటీపడుతున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. **అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు** తమ సమస్యలను పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని బాధిత తల్లిదండ్రులు అంటున్నారు. **‘ కులం ’ ఆధారంగా అవకాశాలా?** జిల్లా జూనియర్ క్రికెట్‌లో కుల ప్రాధాన్యం పెరిగిపోయిందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రతిభ ఉన్నా ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వారు కాకపోతే అవకాశాలు దక్కడం కష్టంగా మారిందని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను సంబంధిత క్రికెట్ అసోసియేషన్ మరియు సెలెక్టర్లు,అధికారులు అధికారికంగా ఖండించాల్సి ఉంది. **చర్యలు తీసుకుంటారా?** వందలాది మంది చిన్నారుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశం కావడంతో జూనియర్ క్రికెట్ సెలక్షన్లపై స్వతంత్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సెలక్షన్ల ప్రక్రియ, వయసు ధ్రువీకరణ, మ్యాచ్‌లలో అవకాశాల కేటాయింపు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి, వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చెన్నేకొత్తపల్లిలో గోల్డ్ లోన్ సంస్థపై తీవ్ర ఆరోపణలు

● ఆడిట్ సమయంలో ఉద్యోగిని రెండు రోజులు కార్యాలయంలోనే ఉంచారంటూ ఫిర్యాదు ● రూ.28.77 లక్షలు చెల్లించినా డబ్బులు తిరిగి ఇవ్వలేదని బాధితురాలి ఆరోపణ ● 35 తులాల బంగారం విషయంలోనూ మోసం జరిగిందంటూ ఆవేదన ● పోలీసులపై కూడా తీవ్ర ఆరోపణలు.. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని వేడుకోలు



చెన్నేకొత్తపల్లి: సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): చెన్నేకొత్తపల్లిలోని ఓ గోల్డ్ లోన్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగిని చేసిన ఫిర్యాదు తీవ్ర చర్చకు దారితీసింది. సంస్థలో జరిగినట్లు చెబుతున్న ఆర్థిక అవకతవకల వ్యవహారంలో తనకు సంబంధం లేకపోయినా, తనను రెండు రోజుల పాటు కార్యాలయంలోనే ఉంచారని బాధితురాలు ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంస్థకు చెందిన కొందరు ఉద్యోగులు, అధికారులపై ఆమె పలు ఆరోపణలు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి 9న సంస్థలో ఆడిట్ నిర్వహించిన సమయంలో కొన్ని అవకతవకలు వెలుగులోకి వచ్చాయని, వాటికి ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి.అనుదీప్ బాధ్యత వహించినట్లు చెప్పినప్పటికీ, డబ్బులు పూర్తిగా రికవరీ అయ్యే వరకు తనను ఇంటికి వెళ్లనివ్వలేదని ఆమె పేర్కొన్నారు. **అర్ధరాత్రి అయినా ఇంటికి పంపలేదంటూ ఆరోపణ** రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో తన భర్త సంస్థ వద్దకు వచ్చి తనను ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా, తనను పంపించలేదని బాధితురాలు తెలిపారు. డబ్బు మొత్తం రికవరీ అయ్యే వరకు తన భార్యను పంపవద్దని మేనేజ్‌మెంట్ ఆదేశించినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తాను రెండు రోజుల పాటు కార్యాలయంలోనే ఉండాల్సి వచ్చిందని ఆరోపించారు. **రూ.28.77 లక్షలు చెల్లించాం.. ఇంకా డబ్బులు రాలేదంటూ ఫిర్యాదు** తన భర్తతో కలిసి సంస్థ సిబ్బందిని ప్రశ్నించగా, కొన్ని ఫ్రాడ్ లోన్లకు సంబంధించిన బంగారం ఉందని, వాటికి సంబంధించిన మొత్తాలను చెల్లిస్తే ఆ బంగారాన్ని లోన్ రూపంలోకి మార్చి తమ డబ్బును తిరిగి ఇస్తామని చెప్పారని బాధితురాలు పేర్కొన్నారు. వారి మాటలను నమ్మి రూ.28,77,749 మొత్తాన్ని కొన్ని లోన్ ఖాతాలకు ఫోన్‌పే, నగదు రూపంలో చెల్లించినట్లు ఆమె ఆరోపించారు. అయితే డబ్బులు చెల్లించిన అనంతరం కూడా తమకు రావాల్సిన మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా రోజులు గడిపారని తెలిపారు. **ఉద్యోగం పోయింది.. జీతం కూడా బకాయే?** ఈ వ్యవహారం అనంతరం తనను ఉద్యోగం నుంచి తొలగించారని, సుమారు 40 రోజుల జీతం కూడా చెల్లించలేదని బాధితురాలు ఆరోపించారు. సంస్థకు ఫోన్ చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. **35 తులాల బంగారం విషయంలో మరో ఆరోపణ** తాను సంస్థలో సుమారు 35 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.10 లక్షల రుణం తీసుకున్నానని బాధితురాలు తెలిపారు. బంగారం విడిపించుకునేందుకు డబ్బులు తీసుకుని వెళ్లిన సమయంలో, ఆ బంగారం వేరే వారి పేర్లపై ఉందని, తానే విడిపించి ఇస్తానని చెప్పి అనుదీప్ డబ్బులు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులైనా బంగారం ఇవ్వలేదని, తమ బంగారంపై మరింత మొత్తాన్ని పెంచుకున్నానని చెప్పి కొంత సమయం కావాలని అనుదీప్ చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. **పోలీసులపై కూడా సంచలన ఆరోపణలు** ఈ వ్యవహారంపై చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. అయితే కేసు విషయంలో స్పందించలేదని ఆరోపించారు. అంతేకాకుండా పోలీసు అధికారికి సుమారు రూ.2 లక్షలు నగదు ఇచ్చినట్లు కూడా ఆమె ఆరోపణ చేశారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, లావాదేవీల వివరాలు, అధికారుల స్పందన వంటి అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. **ఎస్పీని ఆశ్రయించిన బాధిత కుటుంబం** తర్వాత సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఆ ఫిర్యాదును చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. స్టేషన్‌లో తనపై కేసులు నమోదు చేస్తామని, తన భర్త డబ్బులు ఇచ్చిన విషయాన్ని మీడియాకు చెబితే అతనిపై హత్యాయత్నం కేసు పెడతామని బెదిరించినట్లు ఆమె ఆరోపించారు. ఈ ఆరోపణలను సంబంధిత పోలీసు అధికారులు ఖండించారా లేదా అన్నది కూడా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. **“మాకు న్యాయం చేయండి.. రక్షణ కల్పించండి”** సుమారు ఏడు నెలలుగా ఈ వ్యవహారంపై పోరాటం చేస్తున్నామని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని తెలిపారు. **లోకేష్ సార్.. మా కుటుంబానికి న్యాయం చేయండి”** తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, తమకు రావాల్సిన డబ్బులు, బంగారం ఇప్పించడంతో పాటు తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని బాధితురాలు నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. “మా గోడును ఉన్నతస్థాయిలో పరిశీలించి.. ఈ వ్యవహారంలో అసలు నిజాలు బయటకు తీసి మాకు న్యాయం చేయాలి” అంటూ బాధితురాలు విజ్ఞప్తి చేశారు. తమకు రావాల్సిన డబ్బులు, బంగారం తిరిగి ఇప్పించడంతో పాటు, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. తన కుటుంబానికి ఏదైనా జరిగితే సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

బీసీవై విద్యార్థి విభాగం సత్యసాయి జిల్లా కమిటీ ఏర్పాటు

● కన్వీనర్‌గా ఎం. బాలకృష్ణ.. కో-కన్వీనర్‌గా గంగాధర్ ఏకగ్రీవ ఎన్నిక

● విద్యార్థుల సమస్యలపై పోరాటానికి సిద్ధం.. బీసీ సురేష్ యాదవ్

● ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం స్పందించాలంటూ డిమాండ్



కదిరి: సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): బీసీవై పార్టీ విద్యార్థి విభాగం సత్యసాయి జిల్లా నూతన కమిటీని శుక్రవారం కదిరిలో ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్‌గా ఎం. బాలకృష్ణ, కో-కన్వీనర్‌గా గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి విభాగం కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా సత్యసాయి జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి విభాగం తరఫున పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. **విద్యార్థుల భద్రతపై మంత్రి స్పందించాలి**ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, విద్యార్థులపై లైంగిక దాడుల ఆరోపణలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని బీసీ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. **ఫీజుల దోపిడీ అరికట్టాలి** కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. **ఉద్యమానికి సిద్ధం** విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సురేష్ యాదవ్ హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లుగా దాదా పీరా, తాహిర్, ఆసిఫ్, హరికృష్ణ, రాజేంద్ర, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బందరులో గోవా షిప్‌యార్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

అమరావతి, సెప్టెంబర్ 23(నేటి మినిట్ టు మినిట్): మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డు కంపెనీ ఆధ్వర్యంలో భారీ రక్షణ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.8 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.మచిలీపట్నం పోర్టు పరిధిలో సుమారు 400 ఎకరాల్లో యుద్ధనౌకల తయారీ, మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్షంగా, 5,000 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్‌కు అవసరమైన ఆధునిక యుద్ధనౌకలను ఇక్కడ తయారు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర కేబినెట్‌కు మంత్రి కొల్లు రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.